నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శనివారం 9 నవంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

జీసీసీ గోదాంను తనిఖీ చేసిన ఐటీడీఏ పీవో

జన్నారం, నవంబర్ 8 : మండల కేంద్రంలోని పొనకల్‌లో గల జీసీసీ గోదాంను ఉట్నూర్ ఐటీడీఏ పీవో కుష్బూ గుప్తా శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రిజిష్టర్లను ఆమె పరిశీలించారు. అనంతరం గోదాంలో నిలువ ఉన్న బియ్యం, పప్పులు తదితర వస్తువులను ఆమె క్షుణంగా పరిశీలించారు. అనంతరం జీసీసీ అధికారులతో మాట్లాడారు. ప్రతినెలా ఎన్ని క్వింటాళ్ల వస్తువులను సరఫరా చేస్తారని అడిగి తెలుసుకున్నారు.

జీసీసీ గోదాంలోని రిజిష్టర్లను పరిశీలిస్తున్న పీవో కుష్బూ గుప్తా

గూడెంలో కార్తీక సందడి

దండేపల్లి, నవంబర్ 8 : దండేపల్లి మండలంలోని గూడెం రమాస హిత ఆలయంలో శుక్రవారం కార్తీక సందడి నెలకొంది. భక్తులు పవిత్ర గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. కార్తీక దీపాలు వదిలి, గంగమ్మ తల్లికి పూజలు చేశారు. అనంతరం స్వామి వారిని దర్శించు కొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయంలో సామూహిక సత్యనా రాయణస్వామి వ్రతాలు ఆచరిం చారు. అనంతరం అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు.

స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

కోలుకోని గిరి ఆశ్రమం!

విద్యార్థినులకు పూర్తిగా నయం కాకుండానే హాస్పిటల్ నుంచి డిశ్చార్జి చేసినట్లు ఆరోపణలు

- మరోసారి ఇద్దరు బాలికల అస్వస్థత.. దవాఖానకు తరలింపు
- మాజీ ఎమ్మెల్యే వెళ్లే వరకు స్పందించని సిబ్బంది
- వైద్యం చేశాక మరోసారి హాస్పిటల్‌కు వచ్చే పరిస్థితి ఎందుకు వచ్చిందో!
- పాఠశాలకు వెళ్లి విచారణ చేపట్టిన ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా
- లోపలికి ఎవరూ రాకుండా గేట్ వేసి మరీ ఎంక్వైరీ
- నిరసన తెలిపిన విద్యార్థి సంఘాల నాయకులు

విలేకరులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

మంచిర్యాల, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాలలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు ఇంకా కోలుకోవడం లేదు. బుధవారం 12 మంది అస్వస్థతకు గురికాగా.. స్థానిక ప్రభుత్వ దవాఖానలో చేర్పించి గురువారం ఉదయమే డిశ్చార్జి చేయడం.. అందులో కొందరు తిరిగి అనారోగ్యానికి గురికావడం ఆందోళన కలిగిస్తున్నది. బాలికలు పూర్తిగా కోలుకోకుండానే హాస్పిటల్ నుంచి డిశ్చార్జి చేసి హాస్టల్‌కు తరలించారన్న ఆరోపణలు వెల్లువెత్తుతుండగా, తాజాగా.. శుక్రవారం వాంతులు.. కడుపునొప్పితో బాధపడుతున్న ఇద్దరిని మరోసారి హాస్పిటల్‌కు తరలించడం ఇందుకు బలం చేకూరుస్తున్నది. వైద్యం చేసి డిశ్చార్జి చేశాక.. మరోసారి అస్వస్థతతో హాస్పిటల్‌కు వచ్చే పరిస్థితి ఎందుకు వచ్చిందని విద్యార్థి సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. సర్కారు సరైన వైద్య మందించడంలో విఫలమైందని వారు మండిపడుతున్నారు. వాంకిడిలో ఫుడ్ పాయిజన్ జరిగి ముగ్గురు విద్యార్థులు సీరియస్ కండీషన్‌లోకి వెళ్లిన ఘటన సంచలనంగా మారిన మరుసటి రోజే మంచిర్యాలలో మరో ఫుడ్ పాయిజన్ జరగడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమంటున్నారు.

మాజీ ఎమ్మెల్యే వెళ్లే దాక స్పందించని సిబ్బంది

ఫుడ్ పాయిజన్‌తో హాస్పిటల్‌లో చేరిన 12 మంది విద్యార్థినులకు ఒకే రోజు చికిత్స అందించి డిశ్చార్జి చేశారు. కానీ డిశ్చార్జి చేసిన రోజు సాయంత్రమే హాస్టల్‌కు తిరిగి వెళ్లిన 12 మందిలో నలుగురు విద్యార్థినులు వాంతులు చేసుకున్నారని తోటి విద్యార్థినులు చెబుతున్నారు. పూర్తిగా నయం కాకుండానే హాస్టల్‌కు తీసుకొచ్చారని వాపోతున్నారు. శుక్రవారం హాస్టల్‌లో అందరి కోసం చేసిన టమాట బాత్‌నే వారికి కూడా పెట్టినట్లు అస్వస్థతకు గురైన విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థినులు మరోసారి అస్వస్థతకు గురికావడానికి అదే కారణం కావచ్చనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫుడ్‌పాయిజన్ ఘటన నేపథ్యంలో మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు శుక్రవారం ఆశ్రమ పాఠశాలకు వెళ్లి పరిశీలించారు. హాస్టల్‌లోని కిచెన్‌ను, కూరగాయాలు, వంట సామగ్రిని పరిశీలించారు. క్వాలిటీ తక్కువగా ఉన్న పప్పుల శాంపిళ్లను తీసుకున్నారు. వాటిని ఐటీడీఏ పీవోకు పంపిస్తామని చెప్పారు. ఈ సమయంలో అస్వస్థతకు గురైన విద్యార్థినులు సిక్ రూమ్‌లో ఉన్నారని తెలిసి వారి వద్దకు వెళ్లి మాట్లాడారు. ఇంకా వాంతులు అవుతున్నాయంటూ విద్యార్థినులు చెప్పారు. ఇంటి నుంచి తెచ్చిన పచ్చడి తినడంతో జరిగిందంటున్నారు.. నిజమేనా అని ఆయన అడుగగా.. అలాంటిది ఏం లేదు సార్. హాస్టల్ ఫుడ్ మాత్రమే తిన్నామని పిల్లలు చెప్పారు. మాజీ ఎమ్మె ల్యే రావడంతో అప్రమత్తమైన సిబ్బంది వాంతులు చేసుకుంటున్న విద్యార్థినితో పాటు కడుపునొప్పితో బాధపడుతున్న మరో విద్యార్థిని ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు. దివాకర్‌రావు వచ్చే వరకు పిల్లలను హాస్పిటల్‌కు తీసుకుపోకపోవడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

మంచిర్యాల గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో వస్తువులను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

పీవో వాహనం ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఆశ్రమంలో ఐటీడీఏ పీవో విచారణ

విద్యార్థినులు మరోసారి హాస్పిటల్‌కు వెళ్లిన విషయం తెలుసుకున్న ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా శుక్రవారం సాయంత్రం పాఠశాలకు వెళ్లి విచారణ చేపట్టారు. మీడియాను, విద్యార్థి సంఘాల నాయకులకు ఎవరినీ లోపలికి అనుమతించకుండా, గేట్ వేసి మరి దాదాపు గంట పాటు విచారించారు. దీంతో అక్కడికి వచ్చిన విద్యార్థి సంఘాల నాయకులు గేట్ ముందు బైఠాయించి నిరసన తెలిపారు. బయటికి వచ్చిన ఐటీడీఏ పీవోకు గురుకుల ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని, నిరంతరం స్వయంగా పర్యవేక్షించాలని వారు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా మీడియాతో మాట్లాడారు. కడుపులో ఇన్‌ఫెక్షన్ కారణంగా విద్యార్థిని వాంతులు చేసుకుందన్నారు. రెండు, మూడు రోజులు ఇన్‌ఫెక్షన్ ఉంటుందని చెప్పారు. ఇప్పుడు అందరూ బాగానే ఉన్నారని తెలిపారు. ఫుడ్, వాటర్ రిపోర్టు అన్నీ బాగానే ఉన్నాయని తెలిపారు. అన్ని విభాగాల నుంచి ఎంక్వైరీ చేయిస్తున్నామని, రిపోర్ట్ వచ్చాక తదుపరి వివరాలు వెల్లడిస్తామని చెప్పారు. శుక్రవారం ఉదయం ఫుడ్ పాయిజనింగ్‌కు గురైన విద్యార్థినులకు సైతం టమాటా బాత్ పెట్టిన విషయమై ఐటీడీఏ పీవో స్పందిస్తూ.. వారికి లైట్ ఫుడ్ పెట్టాలని వార్డెన్‌ను ఆదేశించినట్లు తెలిపారు.

వాంతులు, కడుపునొప్పితో మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు వచ్చిన విద్యార్థినులు

ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం

గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం. కేసీఆర్ ప్రభుత్వ పాలనలో ఎప్పుడూ ఇలాంటి ఇబ్బందులు రాలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 11 నెలల్లో విద్యార్థుల మరణాలు, ఫుడ్ పాయిజన్ ఘటనలు చోటుచేసుకోవడం దురదృష్టం. మంచిర్యాల గిరిజన ఆశ్రమ పాఠశాలకు గిరిజన కో ఆపరేటివ్ సొసైటీలు సరఫరా చేసే కందిపప్పు, పెసరపప్పు నాణ్యతగా లేదు. చేతిలోకి తీసుకుంటే ఆ పప్పు పుచ్చిపోయాక వచ్చే దుమ్ము నా చేతులకు అంటుకుంది. పిల్లల భవిష్యత్తుతో చెలగాటమాడవద్దు. విద్యార్థులకు అందించే ఫుడ్ మీద ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. నాసిరంక వస్తువులు సరఫరా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

- దివాకర్‌రావు, మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే

టచ్ హాస్పిటల్‌లో రికార్డులను పరిశీలిస్తున్న వైద్య బృందం

'మూడు ఆపరేషన్ల'పై కదిలిన యంత్రాంగం

- ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి విచారణకు ఆదేశించిన డీఎంహెచ్‌వో
- టచ్ హాస్పిటల్‌లో దాదాపు మూడు గంటల పాటు రికార్డుల పరిశీలన

'నమస్తే' కథనానికి స్పందన

మంచిర్యాల అర్బన్, నవంబర్ 7 : బెల్లంపల్లికి చెందిన శివిని ఆమని (42) గత నెల 15న జిల్లా కేంద్రంలోని టచ్ హాస్పిటల్‌లో చేరగా, వైద్యులు మూడు ఆపరేషన్లు చేశారు. గురువారం ఆమె పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు రెఫర్ చేయగా, కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగి యాజమాన్యాన్ని నిలదీసిన విషయం విదితమే. ఈ విషయమై శుక్రవారం 'నమస్తే'లో 'నెలలో మహిళలకు మూడు ఆపరేషన్లు' శీర్షికన కథనం ప్రచురితమవ్వగా, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి హరీశ్‌రాజ్ స్పందించారు. ప్రత్యేక వైద్య బృందాన్ని ఏర్పాటు చేసి విచారణకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు వైద్య బృందం సభ్యులు డా.శివప్రసాద్, డా.అశోక్, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు టచ్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బాధితురాలిని కలిసి వివరాలు సేకరించారు. అనంతరం ఆమె రికార్డులను దాదాపు మూడు గంటల పాటు పరిశీలించారు. ముఖ్యమైన సమాచారాన్ని సేకరించారు. విచారణ సమయంలో అధికారులు హాస్పిటల్ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్య బృందం అడిగిన ప్రశ్నలకు సిబ్బంది పొంతన లేని సమాధానాలు ఇవ్వడంతో పాటు తర్జనభర్జన పడ్డారు. పూర్తి వివరాలను నివేదిక రూపంలో డీఎంహెచ్‌వోకు అందజేయనున్నట్లు వారు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన గురుకుల విద్యార్థులు

రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపిక

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, నవంబర్ 8 : ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్-19 సాఫ్ట్ బాల్ పోటీలకు జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల/కళాశాల విద్యార్థులు విక్కీ, చైతన్య, సాయికుమార్, గోపాల్, అజయ్, రాకేశ్, రాఘవన్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ యాదగిరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జోనల్‌స్థాయి పోటీల్లో ప్రతిభ చూపినట్లు పేర్కొన్నారు. మంచిర్యాలలో 8 నుంచి 10వ తేదీ వరకు జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వీరిని జోనల్ అధికారి అరుణ కుమారి, వైస్ ప్రిన్సిపాల్ రహీం, పీడీ శంకర్, పీఈటీ యాదగిరి, ఉపాధ్యాయులు అభినందించారు.

జోనల్‌స్థాయి వాలీబాల్ పోటీలకు..

సీసీసీ నస్పూర్, నవంబర్ 8 : జోనల్‌స్థాయి వాలీబాల్ పోటీలకు నస్పూర్ జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన శాతం అభిరామ్ ఎంపికయ్యాడని హెచ్‌ఎం దామోదర్‌రావు తెలిపారు. దండేపల్లి మండలం తాళ్లపేట్ జడ్పీ సెకండరీ పాఠశాలలో 6వ తేదీన జరిగిన జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నీలో ప్రతిభ చూపినట్లు పేర్కొన్నారు. మంచిర్యాల జాబ్ సెక్రటరీ పని రాజా, టోర్నీ ఆర్గనైజర్ రోజావర కుమారి, ఉపాధ్యాయ సంఘం నాయకుడు బన్న రవీందర్, పత్తి సత్తయ్య, గాజుల శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయుడు కొండగొర్ల విఠల్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్, గ్రామస్తులు ఆయనను అభినందించారు.

మందమర్రిలో నకిలీనోట్ల కలకలం

మందమర్రి, నవంబర్ 8 : పట్టణంలో నకిలీ నోట్లు కలకలం సృష్టించాయి. స్థానిక పాలచెట్టు ఏరియాలో ప్రతి గురువారం కూరగాయల సంత నిర్వహిస్తారు. ఎప్పటిలాగే గురువారం కూడా హోల్ సేల్ వ్యాపారం చేసే పవన్ కుమార్ సంతలో చిరు వ్యాపారులకు కూరగాయలు సరఫరా చేసి, సాయంత్రం వారి వద్ద నుంచి తనకు రావాల్సిన డబ్బులను తీసుకున్నాడు. రాత్రి ఇంటికి వెళ్లి డబ్బులు లెక్కిస్తుండగా, అందులో ఐదు నకిలీ రెండు వందల రూపాయల నోట్లు వచ్చినట్లు పవన్ తెలిపాడు. కాగా, పట్టణంలో గుర్తు తెలియని వ్యక్తులు నకిలీ నోట్లను చెలామణి చేస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పలువురు వ్యాపారులు అంటున్నారు. చిరు వ్యాపారులైతే గుర్తించరనే ధీమాతో నకిలీ నోట్లతో వస్తువులను కొనుగోలు చేస్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది.

నకిలీ రెండు వందల నోట్లు

అర్హులందరినీ ఓటర్లుగా నమోదు చేయాలి

రాష్ట్రప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్/కెరమెరి, నవంబర్ 8 : అర్హులందరినీ ఓటర్లుగా నమోదు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శుక్రవారం కెరమరి మండలం దేవాపూర్, అనార్‌పల్లి, తుమ్మగూడ గ్రామపంచాయల్లోని పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాతో కలిసి కలిసి సందర్శించారు. బూత్ స్థాయి అధికారులకు తగు సూచనలు చేశారు. అనంతరం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌కు చేరుకొని మాట్లాడారు. నూతన ఓటరు నమోదుకు ఫారం 6 ద్వారా దరఖాస్తు స్వీకరించాలని, పేర్లు, చిరునామా, ఇతర తప్పుల సవరణ కోసం అందిన దరఖాస్తులను పరిష్కరించాలని, మరణించిన వారి వివరాలను జాబితా నుంచి తొలగించాలని అధికారులకు సూచించారు. ఆగస్టు 20 నుంచి సెప్టెంబర్ 15వ తేదీ వరకు ఇంటింటి సర్వే చేపట్టడం జరిగిందని, అక్టోబర్ 29న ఓటరు జాబితా ముసాయిదా ప్రకటించడం జరిగిందని, ఇట్టి జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే బూత్ స్థాయి అధికారులకు తెలియజేయాలన్నారు. అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కారం అనంతరం 2025 జనవరి 1న తుది జాబితా ప్రకటిస్తామని తెలిపారు. ఈ నెల 9, 10 తేదీల్లో ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అనంతరం ఆయన ముగ్గుల పోటీలను తిలకించి.. విజేతలకు బహుమతులు అందజేశారు. ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్ రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారాం, తహసీల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, బూతు స్థాయి అధికారులు పాల్గొన్నారు.


వివరాలు అడిగి తెలుసుకుంటున్న రాష్ట్రప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

పొరపాట్లకు తావివ్వద్దు

జైపూర్, నవంబర్ 8 : పొరపాట్లకు తావులేకుండా ఓటరు జాబితా రూపొందించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఇందారం గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి సందర్శించారు. ఓటరు తొలగింపు సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ వనజారెడ్డి, ఆర్ఐ తిరుపతి, బీఎల్‌వో సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ఎన్నికల పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి

ఆసిఫాబాద్ టౌన్, నవంబర్ 8: గతేడాది నిర్వహించిన శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల్లో సేవలందించిన వారికి ఇవ్వాల్సిన పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డికి బాధితులు వినతి పత్రం అందజేశారు. ఆసిఫాబాద్‌లో జరిగిన ఎన్నికలకు సంబంధించి భోజన వసతి కల్పించిన వారికి రూ. 18 లక్షలు, వీడియో గ్రాఫర్స్‌కు రూ. 15 లక్షలు, పెట్రోల్, డీజిల్ పోసిన బంకు యజమానులకు రూ. 17 లక్షలు, కంప్యూటర్ దుకాణాదారులకు రూ. 13 లక్షలు, వాహనాలకు రూ. 7.05 లక్షలు పెండింగ్ బకాయిలు ఉన్నాయని, మంజూరు చేయకుంటే ఆందోళనలు చేపడుతామన్నారు. నెల రోజుల్లోగా పెండింగ్ బిల్లులు మంజూరు అయ్యేలా చూస్తానని సీఈవో తెలిపినట్లు వారు వివరించారు. ఈ కార్యక్రమంలో బాధితులు సుదర్శన్, సలీం, వంశీ, గుండ సోను, తిరుపతి , తదితరులు పాల్గొన్నారు.

స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలి

నస్పూర్,నవంబరు 8 : ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ మోతీలాల్, ఆర్డీవోలు శ్రీనివాసరావు, హరికృష్ణ, చంద్రకళతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన వారి వివరాలను ఓటరు జాబితాలో నమోదు చేయాలన్నారు.

పట్టుకున్న కలపతో అటవీ శాఖ అధికారులు

12 కలప దుంగల పట్టివేత

ఆసిఫాబాద్ టౌన్, నవంబర్8 : ఆసిఫాబాద్ రేంజ్ పరిధిలోని దంతన్‌పల్లి సెక్షన్ ప్రాంతంలో డోర్లీ-2 వద్ద గురువారం రాత్రి రెండు గంటల ప్రాంతంలో 12 కలప దుంగలను పట్టుకున్నట్లు ఆసిఫాబాద్ రేంజ్ అధికారి గోవింద్ సింగ్ సర్దార్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు కౌటన్ మొవాడ్ నుంచి మందమర్రి వైపు వెళ్తున్న కారును డోర్లీ-2 వద్ద ఆపగా, నిందితులు కారును వదిలి పారిపోవడానికి యత్నించారు. దీంతో సిబ్బంది వారిని చాకచక్యంగా పట్టుకున్నారు. కారుతో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకొని మెట్‌పల్లికి చెందిన కుంసోత్ కృష్ణ, సర్వాయి పేటకు చెందిన బానోత్ శంకర్‌లను అదుపులోకి తీసుకొని రేంజ్ కార్యాలయానికి తరలించారు. రూ. 56,236 విలువైన 12 కలప దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో సెక్షన్ అధికారులు మహేందర్, సాయి, విజయ్, బీటు అధికారులు ప్రకాశ్, సాదీక్, వెంకటేశ్, స్వప్న, సిబ్బంది పాల్గొన్నారు.

పూజలు చేస్తున్న మాజీ జడ్పీ చైర్మన్ కృష్ణారావు

ముగిసిన ఛట్ పూజలు

కాగజ్‌నగర్, నవంబర్ 8 : ఎస్పీఎం క్రీడా మైదానంలోని కొలనులో ప్రారంభమైన ఛట్ పూజలు శుక్రవారం సూర్యోదయంతో ముగిశాయి. వ్యాపారాల నిమిత్తం ఇక్కడికి వచ్చి స్థిరపడిన బిహారీలు సూర్యదేవుడికి ప్రత్యేక పూజలు చేశారు. మాజీ జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు ప్రత్యేక పూజలు చేశారు.

సీఈవోను కలిసిన ఏరియా జీఎం

రెబ్బెన, నవంబర్ 8 : బెల్లంపల్లి ఏరియాలోని గోలేటిటౌన్‌షిప్‌లో గల సింగరేణి గెస్ట్‌హౌస్‌లో రాష్ట్ర చీఫ్ ఎలక్ట్రోరల్ అధికారి (సీఈవో) సుదర్శన్‌రెడ్డిని బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. బెల్లంపల్లి ఏరియాలోని గనులు, ఉత్పత్తి, ఉత్పాదకత వివరాలు సీఈవోకు వివరించినట్లు బెల్లంపల్లి ఏరియా పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి తెలిపారు.

సీఈవో సుదర్శన్‌రెడ్డికి పూలమొక్క అందిస్తున్న ఏరియా జీఎం శ్రీనివాస్

కుకుడ-బెజ్జూర్ రోడ్డుపై ఎడ్లబండిపై వస్తున్న రైతు

మంచు కమ్ముకోవడంతో లైట్లు వేసుకొని వస్తున్న బస్సు

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని మారుమూల పల్లెల్లో చలి వణికిస్తున్నది. ఉష్ణోగ్రతలు రోజు రోజుకూ పడి పోతుండగా, తీవ్రత పెరుగుతూ వస్తున్నది. అర్ధరాత్రి నుంచే దట్టమైన మంచు కురుస్తున్నది. ఉదయం ఎనిమిదైనా మంచు తొలగకపోవడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. కొందరు తప్పనిసరి పరిస్థితుల్లో ఫ్లడ్‌లైట్లు వేసుకొని ప్రయాణిస్తుండగా, మరికొందరు పూర్తిగా మంచు తొలగి సూర్యుడి వెలుతురు వచ్చిన తర్వాతే బయలుదేరుతున్నారు. ఇక సాయంత్రం ఏడింటికే ఇగం మొదలవుతుండగా, రైతులు, కూలీలు త్వరగా పనులు ముగించుకొని ఇళ్లకు చేరుకుంటున్నారు. ఇక కొందరు చలిని సైతం లెక్కచేయకుండా తమ పనులు చేసుకుంటున్నారు. శుక్రవారం తెల్లవారు జామున బెజ్జూర్ మండల కేంద్రంతో పాటు కుకుడలో 'నమస్తే తెలంగాణ' క్లిక్‌మనిపించిన దృశ్యాలు ఇవి..

- బెజ్జూర్, నవంబర్ 8

మంచులో పాలం పనులు చేస్తూ..

కుకుడలో కూరగాయలు కొనుక్కుంటున్న మహిళలు